పాము కాటు



ఎ.వి.రెడ్డిశాస్త్రి

"..........., The Serpant
be guided me and I did eat,"
'The Fall of Man', Genesis 3, (13)

వైశాఖ మాసపు కృష్ణపక్షం. కరంటు కోతవల్ల యావత్ప్రపంచం మీదా నల్లదుప్పటి కప్పినట్లు చీకటి. శాపం తగిలినట్లు కదలకండా నిల్చిపోయిన చెట్లు. ప్రాణాలు తీసేస్తూ ఉక్క.

పందులగుడిసెల్లాంటి యిళ్లల్లో వేసవి తాపానికి యిమడలేక రోడ్లమీదే బైరాయించేశారు బడుగువర్గాల వాళ్లు. విసనకర్రతోనూ, చేతికి దొరికిన అట్టలతోనూ విసురుకుంటూ వేసవి తాపాన్ని పారదోలడానికి నానాతంటాలు పడుతున్నారు. (బీదవాళ్ల పేటలకి గల్లీలే తప్ప రోడ్లుండవు కదా. ఆగల్లీల్లోనే మనుషులూ, జంతువులూ సహజీవనం సాగిస్తుంటారు. ఏ గల్లీలోకి అడుగుపెట్టినా విధిగా కనిపించే దృశ్యం గేదెలు, రొచ్చుల్లో దొర్లుతూ పందులు, జుంయ్‌జుంయ్ మని ముసిరే దోమలు ఇలాటి ఓగల్లీలో)

. గేదెలు నెమరువేస్తూ మాగన్నుగా నిద్రపోతున్నాయి. వాటి పక్కనే నులకమంచం మీద సాయిత్రమ్మ పడుకొని గుర్రుతీస్తోంది. సాయిత్రమ్మకూడా గేది రంగులో నల్లగా వుంటుంది. ఆమె వొంటి మీద వున్న చీర పేడరంగులో వుంది. వెదురు బొంగుల్తో చేసిన నులక మంచం పరిధిని దాటి బయటికి చాచుకున్న ఆమె పాదాలు పేడా, మట్టితో నిండి వున్నాయి. మంచం మీంచి చిందర వందరగా కిందికి జారిపడుతున్న ఆమె ధృడమైన, దట్టమైన తలవెంట్రుకలు అస్తిత్వం నిలుపుకోడం కోసం భూమిలోకి చొచ్చుకు పోవాలని చూస్తున్న మహావృక్షపు వూడల్లా కనిపిస్తున్నాయి. నక్షత్రాల చిరు వెలుగులో మట్టికొట్టుకు పోయిన ఆమె కాళ్లు, పేడమరకల్తో మాసిపోయిన ఆమెచీర, నల్లటి ఆమె శరీరకాంతి, బాహాటంగా వినిపిస్తున్న ఆమె గురక - వీటన్నిటినీ కలిపిచూస్తే ఆమె ఒక భయంకరమైన వ్యక్తిగా అనిపించవచ్చు. అయితే, కరకుతనం ఆమె కావాలని తెచ్చి పెట్టుకున్న గుణం. గొంతుకల్లోంచి లాలిత్యాన్ని బలవంతంగా బయటికి నెట్టేసి, అమ్మతల్లిలా రంకెలు వెయ్యడం అభ్యాసం చేసుకుంది సాయిత్రమ్మ. కాని నిశితంగా చూసేవాళ్లకి మాత్రం యీ కరకుతనం వెనకాత ఏదో అనిర్వచనీయమైన మార్దవం కనపడుతుంది ఆమెలో. మనవల్ని ఆమె ముద్దాడే తీరులో , పాలివ్వడానికి అల్లరిపెడ్తున్న గేదెల్ని ఆమె బుజ్జగించే నేర్పులో, పాలవాడికల వాళ్లని కసురుకుంటూనే వాళ్లకి మంచిపాలు పోసే ఆమె నైజంలో యిదీ అని చెప్పడానికి వీల్లేని ఆదిమాతృమూర్తి లక్షణాలు కనిపిస్తాయి. అయితే, పరమ కఠోరంగా ధ్వనించే గొంతుని అవసరంగా గుర్తించి అలవర్చుకుందామె. ఆ గొంతే లేకుంటే అలివిడు సంసారాన్ని వీధిన పడకుండా కాపాడుకురావడం సాధ్యపడే విషయమేనా? కొడుకులయీది, కోడళ్లయీది, మనవలయీది, కడకు కట్టుకున్న మొగుడయీది- ఆమె హూంకరించిందంటే, గడగడలాడుతూ నుంచో వలసిందే. ఏ మాటకామాటే చెప్పుకోవాలి- సాయిత్రమ్మ పేరు చెబితే ఆమె కుటుంబంలో వున్నవాళ్ల కొక్కళ్లకే కాదు- మొత్తం ఆగల్లీలో వున్న వాళ్లందరికే హడల్.)

సాయిత్రమ్మ మొగుడు తాగుతాడు. ఆమె కొడుకులు సొమ్ములు కాస్కోడానికి తప్ప మరిదేనికీ పనికిరారు. అవకాశం వొస్తే చాలు వాళ్లు కూడా తండ్రిలాగే తాగి తందనాలాడాలని లోలోపల కోరికపడుతూ వుంటారు. అయితే యీ అలగా మూకల ఆటలు సాగనివ్వలేదు సాయిత్రమ్మ బండ గొంతుక పెట్టుకుని, యింట్లో వున్న బండెడు మందినీ అదుపులో వుంచుకొస్తోంది. అదిగో అలాటి సాయిత్రమ్మ యీ వైశాఖ మాసపు కృష్ణపక్షం రోజున సుమారు రాత్రి తొమ్మిది గంటలకే బుడ్డి దీపం సాయంతో యింటిపన్లు ముగించి , వాకిట్లో నులకమంచం వాల్చుకొని నిద్రపోతోంది గురకపెట్టి. సరిగ్గా ఆసమయంలో.

చీకట్లో నడుచుకొచ్చిన తక్షకుడిలా తారట్లాడుతూ ఓమనిషొచ్చి సాయిత్రమ్మ యిల్లనబడే గుడిసెకి కొద్దిదూరం లో నిలబడి, తనక్కావలసిన వ్యక్తి ఎక్కడున్నాడా అని గాలించడం మొదలెట్టేడు. వెలుతుర్లోకన్నా చీకట్లోనే బాగాచూడ్డం అలవాటయిన బావురుపిల్లి కళ్లల్లాంటి వాడికళ్లకి ముందుగా సాయిత్రమ్మ కనవడింది. ఆమెని చూడగానే గతుక్కుమన్నాడు. "ఈ రాచ్చసి ముండ నెగిసిందంటే పనిసెడగొట్టేసాది కావాల" అనే అనుమానం మనసులో కలిగి. (ఈ అలోచనరాగానే వాడికి కాళ్లల్లో సన్నగా ఒణుకు ఆరంభవయింది.) తన దృష్టిని మరికొంచెం సారించి చూసేటప్పటికి తనక్కావలసిన కృష్ణడు వరండాలో బోనిపెట్టెమీద పడుక్కొని, టోకుర్లు కొడుతూ కనిపించేడు.

కృష్ణుడు సాయిత్రమ్మ రెండోకొడుకు. వాడ్ని పిలవాలని వచ్చిన తక్షకుడు సాయిత్రమ్మని చూసి తటపటాయిస్తున్నాడు. తనపిలుపుగాని పొరపాట్న దాని చెవిని పడిందో, అది లేచి కూర్చుంటుంది. ఆ తర్వాత దానినోరు ముయ్యడం వూర్లో యెవరికీ సాధ్యంకానిపని. అయినా తప్పదు- తనొచ్చిన పని అలాటిది- కిష్టడ్ని లేపితీరాలి. అంచేత వచ్చినవాడు మెల్లిగా, పిల్లిలా వరండా వైపు నడిచి, బోనిపెట్టెకి చేరగలిగినంత దగ్గరగా చేరి, ' కుష్టా' అని పిలిచేడు- నెమ్మదిగా. అయితే తుమ్మ మొద్దులా నిద్దరోతున్నవాడికి రహస్యంగా, గుసగుసలాడుతున్నట్టు పిలిస్తే వినపడి చస్తుందా? గొంతు పెంచి పిలవక తప్పలేదు తక్షకుడికి. 'కుష్టా' అని వాడు కాస్త గొంతు పెంచి పిల్చిన పిలుపు సాయిత్రమ్మ చెవిలో పడనేపడింది. (ఎప్పుడేనా ఆదమరచి కాసేపు గాఢనిద్రలోకి జారుకున్నా ఆమె చెవులు చీమచిటుక్కుమన్నా పనిచేసి ఆమె లేచి కూర్చునేటట్టు చేస్తాయి) 'కుష్టా' అని తనకొడుకుని ఎవరో పిలుస్తుండడం చెవిని పడగానే టక్కున లేచి కూర్చుందామె. లేచి కూర్చుని 'ఎవుడ్రాడు' అని గావుకేక పెట్టి మరీ అడిగింది. ఆమెకేకకి అంతా లేచేరు, లేచి కూర్చున్నారు.

సాయిత్రమ్మ మొగుడుకూడా లేచాడు. వాడు తాగుతాడు కనక పడుకుంటే సాధారణంగా లేవడు. కాని సాయిత్రమ్మ వాడి తాగుడుక్కూడా పరిమితి విధించింది. "ఇంతకుమించి ఆడుగింజుకు సచ్చినా ఎక్కువివ్వకు- ఇచ్చావా నా సంగతినీకు తెల్సు" అని సారాకొట్టు పాపారావుకి హెచ్చరిక చేసిందావిడ. పాపారావు లాటి కంగాళీ

ముండాకొడుక్కి కూడా సాయిత్రమ్మంటే చచ్చేంత బెదురు. ఆవిడనోటిని ఎదుర్కొనే ధైర్యం వాడికిలేదు. దరిమిలాను ప్రభుత్వం సారాకొట్లు మూయించేడంతో, సాయిత్రమ్మ మొగుడి అవస్థ నానాదరిద్రంగానూ తయారయింది. ఎక్కడెక్కడ్నుండో పుట్టించి తెచ్చి సాయిత్రమ్మే వాడికి నిర్ణయించిన కోటా అందించేది సాయంకాలం అయేటప్పటికి. అదిగో ఆ విధంగా యివాళ అందిన సరుకు బొత్తిగా నాసిగావుంది వాడికి నిద్రపట్టి చావలేదు. అందువల్ల పెళ్లాంవేసిన కేకకి వాడూ లేచిపోయి "ఎవుడ్రాడు, ఎవుడ్రాడు" అని కేకలకి లంకించుకున్నాడు. ఈ గోలకి వరండాలో బోనిపెట్టెమీద పడుక్కున్న కుష్టడు కూడా లేచిపోయి బయటికొచ్చేశాడు.

కుష్టుడు పాతికేళ్లవాడు, పెద్దవాడు, మూడోవాడిలాగే వీడూ అమాయికంగా తల్లిచాటు బిడ్డలా కనిపిస్తాడు. బయటికి కాని వాడిమనస్సులో వాడిప్రపంచం వాడికుంది. ఒడ్డూపొడుగూ, పుష్టైన జబ్బలు, రింగులు తిరిగిన పొట్టి క్రాపు వీటితో తనెలా వుండాలి? సినిమాల్లో చిరంజీవితో ఫైటింగ్‌కి దిగే విలన్లా వుండాలి- గళ్లలుంగీ, చారలబనీను, ఎర్రటి మత్తుకళ్లు, చేతిలోచైనూ- వీటితో. కాని తనకి ఏర్పాటయిన బతుకేటి? తల్లి దగ్గరుండి వేయించిన అంట్లకత్తెర క్రాపు, సంవత్సరాల తరబడి వుతుకు మొకం యెరగని మురికి నిక్కరు, వంటి మీదకి చిరిగీ చిరగని బనీను- యిదీ అవతారం, ప్రతిరోజూ చేతిలో కర్ర, మరో చేతిలో తాటిగొడుగు, ముందుగా నడుస్తున్నగేదెలమంద- యిదీ తననిత్య జీవితం. గొడ్ల వెనకాతలపడి, రోజంతా తిరిగి తిరిగి అలసిపోయి, ఒళ్లు హూనమైపోయిసాయంత్రం యింటికి చేరేటప్పటికి - అందర్లాగా పెద్ద పెద్ద డోసులు కాకపోయినా, తండ్రి మాదిరి ఓచిన్న బస్తాయేనా మందు వేస్కుంటే ఎంత బావుంటుందీ అని కుష్టడి కల, కాని తాగుడు మహమ్మారి తన తలవాకిలి దగ్గరకి కూడా చేరడానికి వీల్లేదని సాయిత్రమ్మ ఖాయిదా. మొగుడి మాటంటేనా- అది వాడికి తన్తో పెళ్లికాక పూర్వం నుండే వున్న అలవాటు. వాడి అలవాటు. అదుపు తప్పకండా చూస్కోడం వరకే తన బాధ్యత.

ఇంట్లోవున్న జనాన్ని ఎంత ఖాయిదాలో వుంచితే ఆ మాత్రం ముద్ద అందరినోట్లోకీ వెళుతోందో సాయిత్రమ్మకి బాగా తెలుసు. అక్కడికే అనేక రాత్రులు ఆవిడకి యిన్ని మంచి నీళ్లు తప్ప మరేమీ మిగలని పరిస్థితి వస్తుంటుంది. అలాటి వేళల్లో కులదైవాన్ని 'కృష్ణా' అని తల్చుకొని , ఆమంచి నీళ్లనే అమృతాన్ని నోట్లో పోసుకుంటున్నంత సంతోషంగా స్వీకరించి, నులకమంచం మీద నడుంవాలుస్తుంది. ఇల్లుగడపడానికి అత్త ఎన్ని తంటాలు పడుతోందో, ఎన్ని రాత్రులు పస్తులతో ఆమె గడుపుకొస్తోందో కోడళ్లకి బాగా తెలుసు. ఉన్న దాన్ని అందరికీ సర్ది, ఆఖర్న తనకేమీ మిగలకపోయినా బాధపడకుండా, గుక్కెడు నీళ్లు తాగి పడుక్కునే ఆమె గొప్ప తనంకూడా వాళ్లకి తెలుసు. అందుకనే కోడళ్లకి ఆమె అంటే ఆరాధన. అయితే, యింట్లో భత్యానికి గాని, మరి దేనికీగాని యిబ్బందిగా వుందని ఏ కోడలేనా ఎక్కడేనా అన్నట్టు తెలిసిందో, దాన్ని పట్టుకొని పిడిగుద్దులు గుద్దేసిందన్నమాటే సాయిత్రమ్మ, ఇంటి గుట్టు వీధికెక్కకూడ దనేది ఆమెకోడళ్లకి చెప్పకుండా నేర్పినతారక మంత్రం.

అమ్మ పెడబొబ్బలు, అంతాలేచి అరవడం-వీటితో తనకీ తెలివొచ్చేసి బోనుపెట్టెమీంచి గెంతిరావడం జరగడానికి పూర్వం కుష్టడు మాంచి అందమైన కలలో వున్నాడు. కొండచిలువంత పాముమీద చిరంజీవి పక్కిలో బ్రేక్‌డాన్స్ చేస్తున్నాట్ట. అట్టహాసంగా డప్పుల చప్పుడు, తననితినేసేలా చూస్తూ పేడగుంటలు, వాళ్ల వెనకాతల బురద



కొట్టుకుపోయిన గేదెల గుంపులు- ఇదీ వాడికల. అయితే అమ్మకేకలతో కలచెదిరిపోయింది. తన బతుక్కి కలలొకటి అని నిట్టూర్చాడు కుష్టుడు.

అయితే, అంత చీకటిలాటి బతుకులోను కుష్టడికి ఓ చిన్న వెలుతురు కిరణం లాంటి సన్నివేశం కూడా లేకపోలేదు. అవిద్య వాడికి ఎలా పట్టుబడిందో తెలీదుగాని, పాఁవుల్ని పట్టడంలో కుష్టడికి గొప్ప నేర్పు అలవడింది. అది ఎంతటి భయంకరమైన సర్పంకానివ్వండి, దాని మెడదగ్గర మెరుపు వేగంతో నొక్కిపట్టేసే నేర్పు వాడికి పట్టుబడింది. వాడివేళ్లమధ్యని యిరుక్కున్న పావు, పెనుపటకార్లో చిక్కుకుపోయినట్టే. అది ఎంతగింజుకు చచ్చినా వాడి పట్టునుండి తప్పించుకొని బయటపడ్లేదు.

అన్ని సమయాల్లోనీ, అన్ని రుతువుల్లోనీ, అన్ని రకాల బయల జాగాల్లోనీ గేదెల్తో సంచరిస్తుండడం మూలాన, వాడి చేతికి అందకండా తప్పించుకున్న పాఁవుజాతంటూ లేదు. వాటి మెలకువలు, వాటి గమన వేగాలు, వాటి ప్రవర్తన విధానం- యివన్నీ వాడికి కొట్టినపిండి, పాఁవుని చూస్తూనే దాని గమన విధానం చెప్పేగలడువాడు. చూస్తూనే దాన్ని పట్టుకోడానికి తను ఎన్నుకోవలసిన వ్యూహం వాడిమనసులో ఏర్పడిపోతుంది. ఏభావాన్ని వ్యక్తం చెయ్యని వాడి రాతి మొహం, మట్టికొట్టుకుపోయిన వాడి పొట్టినిక్కరూ, చురుకుతనం అసలు కనిపించని వాడినైజం- యిలాటి కుష్టడు మెరుపు వేగంతో పాముల్ని పట్టగలగడం మహాద్భుత విషయంగా కనిపిస్తుంటుంది చూసే వాళ్ళకి. ఈ పాముల్ని పట్టడం విద్య వాడికి రావడం కాదుగాని వాడికి 'పాఁవుల కుష్టడు' అనే పేరు వచ్చేసింది. "మా యింట్లో పాఁవు దూరిపోయింది ఒక్కమారొచ్చి దాన్ని పట్టేయరా నాయనా!" అని నిత్యం ఎవరో ఒకరు వచ్చి వాన్ని బతిమాల్తూనే వుంటుంది. అయితే పాఁవు పట్టమని మనుషులొచ్చిన ప్రతిసారీ సాయిత్రమ్మ కొడుకుమీద విరుచుకు పడిపోతూనే వుంటుంది "యీ పాఁవుల గోల నీకేలా," అని (పాఁవులజోలికి పోవద్దని ఆమె నిత్యం గోలపెడుతూనే వుంటుంది) ఆమె మాటలు విని కృష్టుడు నవ్వేస్తూనే వుంటాడు. "అవి నన్నేటీ సెయ్యవే అమ్మా!" అంటాడు వాడు. గంయ్‌మని లేస్తుంది సాయిత్రమ్మ "ఏటీ సెయ్యవా? ఏఁవీ? పాఁవంటే ఏటనుకుంతన్నావురా? ఇసప్పురుగు తెలిసిందా? దానికి యిశ్వాసాలు, మంచీచెడ్లూ ఏటీ వుండవు. దానికి పాలుపోసినా అది నిన్ను కరవక మాన్దు. అనాటి యిసప్పురుగుల జోలికి నివ్వేల యెల్లాల? ఈ పాలి యెవుడేనా పాఁవుని పట్టనానికి రమ్మనాల, నువ్వు ఎల్లాల, అప్పుడు నా అవుతారం నువ్వు సూడాల! నా నంటె ఏటనుకుంతన్నావు? జాకర్త, మూడ్రోజులు ముద్దకానకంట కొట్లో పెట్టి తలుపేసేగల్ను! "అదికాదే అమ్మ! నాను పాఁవులు పట్టనానికి ఎవుడి కాడా దమ్మిడీ డబ్బు పుచ్చుకోను, నాను పట్టిన పాఁవుని ఏనాడు సంపను. దాన్నొట్టికెల్లి ఏ తోట్లోంచో, దొడ్లంటో ఒగ్గేస్తాను. అందికనే

వాటికి నేనంటే నమ్మకం-మన్నాడు యేటీ సెయ్యడని. అందికనే అవి నన్ను కరవ్వు".

"ఓర్నాయినోర్నాయినో - దరువ రాజు మళ్లీ యీ కుష్టడి రూపంలో పుట్టేసి యీ బూమ్మీద పెరగతన్నాడు తండ్రా! ఒరే, ఓర్నంగిర్నా కొడకా! నివ్వేటి సెయ్యవని అవి నిన్నేటి సెయ్యికంట ఒగ్గేడానికే - యిది శ్రీరామ్డున్నాటి కాలం కాదురా! నివ్వేటీ సెయ్యికపోయినాసరే, పతిపాము టైము దొరికీ దొరగ్గానే నిన్ను కరిసి తినియ్యాలనే సూస్తుంటాది. యాదన్నుంచుకో. దాని గుణవది దానికి మనవేటీ సెయ్యిలేం. అందికని నా నూటిని యియ్యాలకాడ్నుండి పాముల జోలికెల్లకు. ఎవుడేన నిన్ను మెంగపెట్టినాడనుకో - మాయమ్మ ముండ నన్ను నంపేస్తాదని నాదనామీదికి తోసే" అని ఆవేళ సాయింత్రం సాయిత్రమ్మ కిష్టడ్ని బాగా తిట్టి ఒదిలిపెట్టింది. ముంగిలా మొహం మాడ్చుకొని మూలకిపోయి పడుక్కున్నాడు కుష్టడు - తల్లిని ఎదిరించే ధైర్యం లేక, పావుని పడతన్నప్పుడు యెంత గమ్మత్తుగుంటుదో, యెంత సంతోషం కలుగుతాదో దానికే టెరిక! ఒంటి మీదున్న ఎంత్రికలు నిక్క బొడుసుకొని, తల్లోంచి అవిరినెగిసినట్టు చెమట పట్టేసి - అలాటి ఆనందం ఎవుడికొస్తాది! తనకి బతుకులో వున్న యీ ఒక్క సరదా కూడా లేకంట సేసేయాలని సూస్తందీ మహాతల్లి !

తల్లీకొడుకులావిధంగా పాములు పట్టడం విషయంలో ఘర్షణ పడిపడి చివరికి ఎవరిపక్కలమీద వాళ్లు పడుక్కొని దొర్లుతున్నారు, వైశాఖ మానపు ఉక్క వూపిరి సలపనివ్వకుండా ఓ పక్కనించి చంపేస్తుంటే, తాజాగా ముగిసిన తగువు మరోపక్క నుండి మనసుని దొలిచేస్తోంది ఆ యిద్దరికీ. నిద్దర్లు రాక యిద్దరికిద్దరూ అటూ యిటూ దొర్లుతున్నారు. చివరికి నిద్రకి దయకలిగి మూగన్నుగా అలా నిద్రపట్టిందో లేదో అంతలోకే 'కుష్టా' అనే పిలుపు సాయిత్రమ్మ చెవిల పడి, అవిడ గుయ్యిమని లేచేటట్టు చేసింది "ఎవుడ్రా నువ్వు" అంటూ.

వచ్చిన తక్షకుడు తనెవరో చెప్పుకోడానికి సందేహిస్తున్నవాడ్లా తటపటాయించేడు మాట్లాడకుండా సమాధానం రాకపోవడంతో మరింత వెర్రెత్తిపోయి స్వరం ఆకాశం ఎత్తుకి ఎంచి గర్జించింది సాయిత్రమ్మ : " ఎవుడంటే పలక్కంట వులక్కంట దెయ్యింనాగ నిలబడ్నావు ఎవుడ్రా నువ్వు " అని అరుస్తూ, మంచంమీంచి లేచి కొప్పుముడి వెయ్యటం మొదలెట్టింది. ఆవిడ ఆపద్ధతిలో లేచేక యింకా తనెవడో చెప్పుకోకపోతే, చెయ్యిచేస్కొని నాలుగు తరిచీడానికి కూడా వెనకాడదు సాయిత్రమ్మని అవచ్చిన వాడికి తెలుసు. అంచేత నోరువిప్పి "ఏటప్పా ఆ కేకలు, నానూ, పాపారావుని" అన్నాడు.

"పాపారావంటే ?" అని రెట్టించింది సాయిత్రమ్మ. కొన్నాళ్లుగా సారాకొట్టు మూసేడం మూలాన్న సారా కొట్టుపాపారావు మాట గభీమని ఆవిడికి గుర్తురాలేదు. "ఏటప్పా మరీ సన్నెరగనట్టు !- నానూ సారాకొట్టు పాపారావుని" అని తనగురించి చెప్పుకున్నాడు. పాపారావు గొంతుకలో మునపటి ధాటీలేదు. ప్రభుత్వ సారా దుకాణం నడుపుతున్న రోజుల్లో నయితే పాపారావు పులిలా గర్జించేవాడు. సారాకొట్టు మూసేసి వ్యాపారం మూలపడ్డంతో వాడి గొంతుకలో కాస్త నీరసం ధ్వనిస్తోంది.

వచ్చినవాడ్ని పోల్చింది సాయిత్రమ్మ, పోల్చి "పాపిగా - నివ్వా? సీకట్లో ఏంకాని ఏలప్పుడు యిలా గొచ్చినావేటి? ఇనాటప్పుడు కుష్టడ్ని పిలస్తన్నావు -ఆడితో నీకేటిపని?" అని నిలవ దీసింది.

పాపిగాడు నంగిరోడుతున్న గొంతుతో "అదికాదప్పా - పెదబాబు కుష్టడ్ని ఒక్కపాలి తీసుకు రమ్మని తోల్నారు", అన్నాడు.

"అదేంన్ర - యింత రాత్తిరప్పుడు పెదబాబుకి కుష్టడితో పనేటీ అని'

"బాబుగారి లోగిల్ల పార్టీ అవుతోంది. బాబుగారి స్నేయితులు పెదపెద్దోళ్లు యింటినిండా వున్నారు. డిన్నరు పెట్టినారు. ఒండిన వొంటలున్న గదిలోకి ఏదో పెద్దపాము సొరబడిపోయింది. లోపలికి అడుగెట్టనానికి ఎవలుకీ ధైర్యం సాలకంటుంది. వొచ్చినోళ్లంతా డ్రింకులు పూర్తిచేసేసి. బోజినానికి ఆవురావురుమని రడీ అయిపోయికూకున్నారు. ఇత్తలసూస్తే వొంటసామాన్లున్న గదిలోకి పాము సొచ్చిపోయి కూకున్నాది. అందికని......" మాటపూర్తిచెయ్యికుండా నసిగేశేడు పాపారావు. "సేబాస్సే బాస్రా పాపిగా నివ్వు సెప్పుకొస్తున్నకత ! గడిసేపటికి ముంగల నానేమో గెంజిలోకి వుప్పుగడ్డ కూడా యింట్లో నేకంట అయిపోనాదని కుమిలి, కుమిలి ఏడ్చిసచ్చినాను. మరిపెదబాబింటి కాడేమో, ఆయన స్నేయితులు పూటుగా తాగేసి, తయారైకూకున్నకూడు నోటికాడికి రాకపోడంతో గందిలైపోతున్నారు. ఇసిత్రం సూసినావా - నానేమో యింట్లో పైసాలేక తిండికి కిరకిర్లాడిపోతే, వొంటగదిలోకి ఓ సిన్న పాము సొచ్చిపోవడంవల్ల యీ పెద్దోళ్లంతా తిండి దొరక్క కిరకిర్లాడి పోతన్నారు. అయితే తెలకడుగుతాను నీలాటి సెప్పుల్నాడీనో వోళ్లు పెదబాబింటికాడ వొందమందున్నారు కదా మీరెల్లి ఆ పామువి ఓ పెట్టుపెట్టేస్తే బోయినాలకి మరేటి అడ్డుండదుకదా - అనాటిది మీరంత ఏల ఆలీసం చేస్తన్నారు?' 'అని నిలవ తీసింది సాయిత్రమ్మ.

పెదబాబు జిల్లా అంతటికీ పేరుమోసిన సారా కంట్రాక్టరు. ఆయన కూడా మొదట్లో సాదాసీదా మనిషే అయినప్పటికీ, సారావ్యాపారంలో లక్షలకి లక్షలు సంపాదించేడు. తరవాత పేదవాళ్ల పేటలోనే వున్న తన యింటిని పడగొట్టించేసి, చుట్టూవున్న రెండు మూడు జాగాల్ని కొనేసి, ఆ జాగాలో విశాలమైన పెద్దభవంతిని అన్ని హంగుల్తోనీ కట్టించేడు. అయితే యీ మనుమధ్యని ప్రభుత్వం సారావ్యాపారం నిషేధించడంతో ఆయనకి కొద్దిగా చికాకు పరిస్థితులొచ్చేయి. మళ్లీ త్వరలోనే కోల్కొని ప్రత్యామ్నాయ వ్యాపారం గురించి ఆలోచనలు ప్రారంభించేడు. అలవాటయిన ఫీల్డుకనక సారాని దొంగచాటుగా కాయించి అమ్మితే లాభాలు యింకా భేషుగ్గా వుండవచ్చునని పించింది. కాని ఆఫీల్డులోకి తను ఒక్కడూ దిగిపోకూడదు. వెన్నుపోటుదార్లు లేకండా చూస్కోవాలంటే, సారావ్యాపారంలో యింతకుముందు తనతోకలిసి పనిచేసిన వాళ్లందర్నీ కలుపుకురావాలి. ఈ రకంగా ఆలోచన చేసి, తన ఆలోచనలకి ఒక కార్యరూపం యిచ్చే మార్గంలో భాగంగా యివాళ రాత్రి తన మాజీ కొలీగ్స్ అందరికీ డిన్నర్ ఏర్పాటు చేశాడు పెదబాబు.

ఈ సారాగ్రూపులో కర్మకాలి ఓరిటైర్డ్ ఇంగ్లీషు లెక్చరర్ కూడా తగలడ్డాడు. ముప్ఫయ్యేళ్లు పనిచేసి మూడువేలు కూడా వెనక వెయ్యలేకపోయినాడా పెద్దమనిషి వ్యసనాల పుణ్యమా అని వ్యసనాల్నే వ్యాపారంగా మార్చి చూస్తే ఎలావుంటుందో అనే ఆలోచనకలిగి రిటైరయినాక నిస్సిగ్గంగా మందు వ్యాపారంలోకి దిగేడు. పెదబాబు యింట్లో విందుకి ఎటెండయిన వాళ్లల్లో యితగాడ్ని మినహాయిస్తే పెద్దగా చదువుకున్న వాళ్లెవళ్లూ లేరు. (వాళ్లంతా కొత్తగా ధనదాహంబలిసిన మధ్యతరగతి వర్గంవాళ్లు, 'నీతుల-గీతులు' అన్నవి వాళ్లకి చవట వాగుడు లాగ వినిపిస్తుంది. ఏగడ్డికరిచేనా డబ్బు సంపాదించడమే గొప్పనీతి అనే ఆదర్శంతో బతుక్కొస్తున్న నియోరిచ్ క్లాసు వాళ్లది)

పార్టీకి వస్తూనే యింకా యెక్కడో మిగిలిపోయిన పాతకాలపు మిల్టన్ గుర్తుకురాగా, తన ప్రజ్ఞ అందరి ముందూ ప్రదర్శించాలనే తాపత్రయంతో "హలో పెదబాబూ, ఓడిపోయిన తనసైన్యాన్ని మళ్లీ కొత్తదాడికి సమీకరించడానికి తయారయిన సేటన్(Satan) లాంటి

వాడివయ్యా నువ్వు - ట్రూ ! (True) నీ భావనం కూడా అచ్చు మోడర్నుడే పేండి మోనియమ్ లాగే వుంది - చీకటిలో మగ్గుతున్న నరకం లాంటి గుడిసెల మధ్య నీతలుకు బెళుకుల మందిరం" అని ఘొల్లున నవ్వేడు రిటైర్డ్ ఇంగ్లీషు లెక్చరర్, అయితే అతగాడి నిట్టుని అర్ధం చేస్కోగల స్థాయి పాపం అక్కడెవరికీ లేదు. ఓ వెర్రినవ్వు మాత్రం నవ్వేసి వూరుకున్నారు.

"గడి సేపటికి ముంగల నానేమో గెంజిలోకి వుప్పుగడ్డ కూడా యింట్లో నేకంట అయిపోనాదని కుంవిలి ఏడ్చినచ్చినాను" అని సాయిత్రమ్మ అనుకోకుండా తన యింట్లో రేగుతున్న ఆకలి జ్వాలల గురించి బయటికి అనేసిన మాట పాపారావు చెవుల్లో పడగానే వాడి మనస్సులో ఓ మెరుపులాంటి ప్లేను రూపుదిద్దుకుంది. అయితే తన ప్లాను అంత తొందరగా బయటపెట్టేకుండా, ఆఖర్న తురుపు ముక్కలా వాడాలని నిశ్చయించుకొని, బయటికి మాత్రం "అప్పా ! అప్పా! యీ ఒక్కపాలే నన్ను రచ్చించు. ఈ దిక్కుమాలిన పాంవుకాదు గాని, పెదబాబు గారి పార్టీ పాడయిపోయిలా కనపడతంది. పార్టీగాని పాడయిపోయిందా, ఆయిన్ని నమ్ముకున్న నాలాటోళ్ల బతుకు నాశినంవైపోతాది. అప్పుడు నాను కూడా మీ యింటిముందు నిలబడి సిలవరి తపేలా పట్టుకొని గెంజినీళ్లు పొయ్యిమని అడుక్కోవాల ".

"అడుక్కోరా నీకదే రాసిపెట్టుంటే అలాగే అడుక్కుంటావు. నీవు సారాకొట్టు ఎట్టి ఎన్నికొంపల్ని గుల్లసేసీనావో, యెంత మంది యీదులంట ముష్టెత్తుకు తిరగతన్నారో నీకెరికి నేదేటి? అంత మందిని నాశినం సేసినావు కదా- ఆల్లవునురు నీకు తగలకంట పోతాదేటి? నీలాటోల్లు చిప్పలు పట్టుకొని తిరిగిన్నాడు - బొత్తిగా బగవంతుడన్నోడు నేకంట పోనేదని నమ్ముతాను" అంది సాయిత్రమ్మ వుద్రేకంగా. "అప్పా, అప్పా ! పెద్ద దానివి బూదేవత లాటి దానివి. అలాటి సేపాలు నీనోట్నుండి రాకూడదు గాక రాకూడదు. కావాలంటే నామీద పిడుగు పడిపోవాలనో, బస్సుగుద్దేసి నానుసావాలనో తిట్టు. సారాకొట్టెట్టో, సానికొట్టెట్టో బతికానానంటే - ఆటెనుట్టూ తిరిగే నాకొడుకులండబట్టే కదా ! నీ త్తక్కువ పనని నానా యేపారం సెయ్యకపోతే సరా? మరో నీత్తక్కువోడు సేస్తాడాయాపారం. పెపంచికంతీరే ఆ రకం గున్నప్పుడు, నానేల ముక్కుమూస్కోని కూకోవాల? ఏదో సేసి, నానూ, నాకుటంబం కూడా బతుక్కురావాలి కదా!" అని లోకధర్మం గురించి తనకి తెల్సింది చెప్పి, మళ్లీ సాయిత్రమ్మ గుక్కతిప్పుకొని వుపన్యాసానికి దిక్కముందే, బతిమాల్టం ప్రారంభించేశాడు. "అప్పా, అప్పా, మనకుష్టడు బెమ్మాండంగా పాంవుల్ని పడతాడని అందరికి తెలుసు. అది ఆడికి బగమంతుడిచ్చిన వొరం. ఆ వొరంతో ఆడు అందరికీ వుపకారం సేస్తన్నాడు. పెపెంచికానికి ఆడు వుపకారం సెయ్యికంట సేసి పాపం మూట కట్టుకోకు. నీ దుష్టికొచ్చిందో నేదో తెల్దు, కాని మన వూర్ల కొంత మందికి కుష్టడ్ని నూస్తే శ్రీ కిష్టపరమాత్ముడ్ని నూసి నట్టనిపిస్తాదిట. కిష్టమూర్తి కాలీయుడ్ని సితకామతకా తన్నీసి తోలీసినాడుగాని నంపేనేదే ! మన కుష్టడు కూడా అచ్చం అనాటోడే. పట్టుకున్న పాంవుని

బెమ్మాండంగా పాంవుల్ని పడతాడని అందరికి తెలుసు. అది ఆడికి
బగమంతుడిచ్చిన వొరం. ఆ వొరంతో ఆడు అందరికీ వుపకారం సేస్తన్నాడు. పెపెంచికానికి ఆడు వుపకారం సెయ్యికంట సేసి పాపం మూట కట్టుకోకు. నీ దుష్టికొచ్చిందో నేదో తెల్దు, కాని మన వూర్ల కొంత మందికి కుష్టడ్ని నూస్తే శ్రీ కిష్టపరమాత్ముడ్ని నూసి నట్టనిపిస్తాదిట. కిష్టమూర్తి కాలీయుడ్ని సితకామతకా తన్నీసి తోలీసినాడుగాని నంపేనేదే



పదినిమిషాల్నుండీ యీ తమాషానే ఊపిరి బిగబట్టి మరీ చూస్తున్నాడు కుష్టడు- అమ్మ ఏంవిటంటుందో వినాలని. చివరికి మరివుండ బట్టలేక, ఎలాగో ధైర్యం చేసి "అమ్మా ! పోనీ యీ ఒక్కసుట్టూ పాంవుని పట్టేసి ఎక్కడేనా జిల్లీసి పారేస్తానే! పాపయ్యా మనీదోడేకాదా, మరాడు అంతలెక్కని బతిమాల్తుంటే యీ ల్లేదంటే మనకి మాత్రం మరియాదేటి!" అన్నాడు. "అదిరామాటకుష్టా" వుత్సాహంగాకేకవేశాడు పాపారావు, కుష్టడి మాటలకి మద్దత్తులాగ, వెంటనే సాయిత్రమ్మ వేపు తిరిగి, "అప్పా! నివ్వూ నేనూ గొప్పోళ్లంకావు, నిజంవే! నానా కష్టాలు పడతన్నప్పటికీ, నాలుగు వేళ్లూ నోట్లోకెల్లకంటున్నాయి సరిగ్గా. పెద బాబియాళ దశతిరిగి పెద్దోడయినాడు. కాని ఒకప్పుడు మన మద్దిని మసిలిన మనిసేకదా! మన మద్ది లెగ్సి నెగిసి ఎత్తిరిల్లిన మనిషికి యియాళ యీ పాంవు వల్ల పరువు పోయిందంటే, ఓరకంగా మనకి పరువుపోయినట్టే కదా! అందికని అప్పా, సాయిత్రమ్మప్పా ! యీ ఒక్కసుట్టూ పాంవుని పట్టనానికి కుష్టడ్ని తోలి నా బతుకూ, పెదబాబు పరువూ నిలబెట్టు ! అతగాడి అనతగాని నివ్వు తప్పించినావంటే, రేపుతెల్లారే తప్పటికి పెదబాబు నీకెలాటి యినాం తోల్తాడో నీకల్లతో నివ్వే సూద్దువుగాని" అని తను వాడతల్చుకున్న తురుపు ముక్కని వాడేశాడు పాపారావు.

"తెల్లారీ తప్పటికి యినాం" అన్నమాట సాయిత్రమ్మ గొంతుని మరిలేవనివ్వకుండా బలవంతంగా నొక్కేసింది. తెల్లవారేటప్పటికి యింట్లో బునలు కొడుతూ లేచే ఆకలిసర్పం - ఆమె మనస్సుకి శాంతి లేకుండా చేస్తూనేవుంది. అలాటి సమయంలో "పొద్దున్నే యినాం" అనే పాపిగాడిమాట ఆమె చెవులకి నాగస్వరంలా వినిపించింది. పాంవుల్తో ఆటలాడొద్దని ఓగంటక్రితం వర్కు కొడుకుతో తను వేస్కున్న యుద్ధం సంగతి ఆమె మర్చిపోయింది. ఇంట్లోవున్న పిల్లాజెల్లా రేపుతిండికి అఘోరించనక్కర లేదనే ఊహ ఆమె నుండి ఏదో పెద్ద భారం తీసేసి నట్లనిపించింది సాయిత్రమ్మ ఓడిపోయింది.

అమ్మమాట్లాడక పోవడాన్ని తనువెళ్లడానికి అంగీకారంగా భావించిన కుష్టడు, ఒక్కగెంతులో పాపారావుని చేరుకొని "పదరా దద్దా!" అన్నాడు.

ఆటలాడొద్దని ఓగంటక్రితం వర్కు కొడుకుతో తను వేస్కున్న యుద్ధం సంగతి ఆమె మర్చిపోయింది. ఇంట్లోవున్న పిల్లాజెల్లా రేపుతిండికి అఘోరించనక్కర లేదనే ఊహ ఆమె నుండి ఏదో పెద్ద భారం తీసేసి నట్లనిపించింది సాయిత్రమ్మ ఓడిపోయింది.

అమ్మమాట్లాడక పోవడాన్ని తనువెళ్లడానికి అంగీకారంగా భావించిన కుష్టడు, ఒక్కగెంతులో పాపారావుని చేరుకొని "పదరా దద్దా!" అన్నాడు.



ఏలాలని పెదబాబు ఎత్తు" ముద్ద మాటల్తో మరో ఆయన వేసిన కేక.

"పాము పాముంటావ్ - అదేమన్నా గార్డెన్ ఆఫ్ఏడెన్ లోకి ప్రవేశించిన సేటన్‌లాంటి దేమిటయ్యా" ఇంగ్లీషు మేష్టరి లిటరరీ జోక్.

"అదెంత పెద్దపామయితే మట్టుకు - ఓ నలుగురు మనుషులు కర్రలు పట్టుకొని దాన్ని బాదీలేరటయ్యా? ఇంతకంటే భయంకరమైన శత్రువులు ఎంత మందిని మనం చీకట్లో దొంగచాటుగా హరీ మనిపించలేదు!" ఇంకో కంట్రాక్టరు సూచన. వాళ్ళు ఆడుతున్న మాటలు శూలాల్లా తగులుతున్నాయి పెదబాబు చెవులుకి. అయినా ఓర్మిగా వాళ్లమాటలు భరించవలసిన పరిస్థితి అతన్ది. మాటలంటున్నవాళ్ల చేతులూ, గడ్డాలు పట్టుకోని బతిమాల్తూ "ఫ్రెండ్స్, ఫ్రెండ్స్ - కోపం తెచ్చుకోకండని ప్రార్థిస్తున్నాను. ఈ డిలే నాకుమాత్రం సరదానా ఏమిటి! లోపల దూరింది జాతైనత్రాచుపాము. మనం కొత్తగా యీ స్కీము ప్రారంభిస్తున్నాప్పుడు ఏదైవం మనని పరీక్షించాలని యీ పాము రూపంలో వచ్చాడో! అంచేత యిలాటి సమయంలో పాముని చంపడానికి నాసెంటిమెంట్ ఒప్పుకోదు. కొంచెం మీరంతా నామీద సానుభూతి చూపించి ఓపిక పట్టాలి. పావుని అవలీలగా పట్టేసేవాడొకడు యిక్కడికి దగ్గిరగానే వున్నాడు, వాడికి కబురు వెళ్లింది. ఈ పాటికి వాడు వచ్చేస్తూవుంటాడు- నామాటంటే వాడికి బాగాగురి" అన్నాడు.

ఆలస్యం యిక ఎంతమాత్రం భరించలేని ఒక పెద్దమనిషి "ఇదిగో పెదబాబూ ! మన సంప్రతింపులు, ఒప్పందాలు పూర్తయి గంటన్న రయింది. మందురౌండ్లు పూర్తయి అరగంట దాటింది. ఇంకా ఫుడ్ లేక పోతే యెలానయ్యా? పోనీ ఓ పన్చెయ్యి ఏదేనా నాన్‌వెజ్‌హోటల్నుండి సరుకు తెప్పించేయ్యి - ముందుగా కథనడుస్తుంటుంది" అని సజస్ట్ చేశాడు.

విన్లేక చెవులు మూసుకున్నాడు పెదబాబు. "సారీఫ్రెండ్స్ నేనాపని మాత్రం చెయ్యలేను. మీ లాంటి వాళ్లని విందుకు పిల్చి, కబేళా కొట్లల్లో వాళ్లు మిగుల్చా, తగులుగా కొనితయారు చేసిన నాసిరకం ప్రిపరేషన్స్ మీకు సెర్వేచేయించి నన్నునేను అవమానపర్చుకోలేను. మీకు అరుదైన వంటకాలు వడ్డింపించాలని యిద్దరు స్పెషల్ కుక్స్‌ని తెప్పించాను. ఆ ఒరియా కుక్, ముస్లిమ్ కుక్ జమీందార్ల దగ్గర వంటలు చేసిన వాళ్లు. మీకోసమని వేరే డిషెస్ తయారుచేశారు. అన్ని ప్రిపరేషన్సు చాలా రుచిగా వచ్చేయట. అయితే మనం వెంటనే భోజనాలు చెయ్యడానికి వీల్లేకండా భగమంతుడు మన ఓపికని పరీక్ష పెడుతున్నాడు. అంచేత కొంచెంసేపు మీరు సహనం చూపించాలి అని ప్రాధేయపడ్డాడు. ఇంతలో ఇంగ్లీషు లెక్చరర్ లేచి "పెదబాబూ! దేవుడు మనసహనాన్ని పరీక్షస్తున్నాడన్నావు. ఇక్కడే చిన్న డౌటు. మనం దేవుడి పార్టీయా, లేక దెయ్యంపార్టీయా? మనసహనాన్ని పరీక్షిస్తున్నది దేవుడా, దెయ్యమా? కాసేపు యీ ఎథికల్ క్వెచ్చన్ మనం వాదోపవాదాలకి దిగితే కాలం దానంతటదే గడిచిపోతుంది. వాట్, షల్ వియ్?" అని తగులుకున్నాడు.

అసలే ఆకలితో చస్తున్నజనానికి ఆయినగారిమాటలు కరక్కాయల మాదిరి మింగుడు పడక నానాయిబ్బందిగానూ ఫీలయారు. ఒకరిద్దరయితే ఆయన అలా అర్థంలేని వాగుడు ఎందుకు వాగుతున్నాడో కనుక్కుంటామని లేచిపోతుంటే, పెదబాబు వాళ్లకి బోధపర్చి కూర్చోబెట్టేడు.

ఇంతలో పాముల్ని పట్టేకుష్టడు వచ్చేశాడనేవార్త డాబా మీదికి పరుగెత్తుకొచ్చి చెప్పేరు ఎవరో, పాముల్ని పట్టే మొనగాడు ఏ మాదిరిగా వుంటాడో చూడాలనిపించి, విందుకొచ్చిన అతిథులంతా బిరబిరా డాబా దిగి క్రిందికొచ్చేశారు, సారామత్తుకి అటూ యిటూ జోగుతూ, పామెక్కడవుందో, ఎంతుందో, ఎలావుందో కుష్టడికి అభినయిస్తూ మరీ చెప్పేరు ఒరియా, ముస్లిమ్ కుక్కులు. అసలే వాళ్ల భాష అక్కడెవరికీ బోధ పడ్డంలేదు. అందులో వాళ్లు మందుపట్టుమీద కూడా వున్నారేమో, వాళ్లు చెప్పింది ఒక్కముక్క కూడా అర్థంకాలేదు కుష్టడికి, వేడుక చూడ్డానికి చుట్టూపోగయిన జనాన్ని తప్పించుకొని, వండిన పదార్థాలు వున్నా యని చెప్పబడుతున్న గదిలోకి నిర్భీతిగా ప్రవేశించేడు కుష్టడు.

లోపలికి ప్రవేశించేటప్పటికి వాడికి ఆశ్చర్యంతో గుండె ఆగినంత పనయింది. దేదీప్యమానంగా వెలుగుతున్న ట్యూబ్‌లైట్ల కాంతిలో, తళతళ మెరిసిపోతూ పెద్దపెద్ద స్టీలు గిన్నెలు. ఆ గిన్నెల్లో తను జన్మలో ఏనాడూ చూసిగాని, వినిగాని, తినిగాని వుండని రకరకాల మాంసాలు. గిన్నెల్లోని వంటకాలు వేడిగా వుండాలని సన్నసెగలమీద గిన్నెల్ని వుంచారేమో, వాటిలోంచి సుతారంగా ఆవిర్లు బయటికొస్తున్నాయి. వాటి ఆహ్లాదకరమైన, చవులూరించే వాసనలు ముక్కుకి తగిలి కుష్టడి నాలిక జివ్వుమనేట్టుగా నోరూరిస్తున్నాయి. వాటిని రుచి చూస్తే బావుండుననే కోరిక ఎలాటి మానవ మాత్రుడికేనా కలక్కమానదు.

కుష్టడి పరిస్థితి వింతగా వుంది. ప్రపంచంలో చాలీచాలని బతుకులు బతుక్కొస్తున్న అర్థాకలిగాళ్ల ఏకైక ప్రతినిధిలా గది మధ్యని నిలబడివున్నాడు వాడు. ప్రపంచంలోని అత్యంత రుచికరంగా తయారైన వంటకాలని సంకేతంలా పాత్రల నిండావున్న వంటకాలు వాడికెదురుగా వున్నాయి. అవన్నీ కుష్టడ్ని ప్రలోభ పరుస్తుంటే, వాడు తాత్కాలికంగా తనొచ్చిన పని మర్చిపోయి, ఆబగా వాటి వేపు చూస్తున్నాడు. అయితే యిదంతా కేవలం ఓ అయిదు నిమిషాలపాటు జరిగిన దృశ్యం. ఇంతలో బయట్నుంచి పాపారావు కేక వెయ్యనే వేశాడు "ఏట్రా, పురుక్కనిపించిందా?" అని. ఆ కేకకి తృళ్లిపడి యీ లోకంలోకి తిరిగొచ్చిన కుష్టుడికి తనొచ్చిన పని గుర్తొచ్చింది. వెంటనే వాడి నిశితమైన చూపు గది నాలుగు మూలలకీ ఎక్స్‌రే వేగంతో ప్రసరించింది. గదిలో ఎక్కడా పాము అలికిడి లేదు. మరో మారు గదిలో పాము లేదని నిశ్చయం చేస్కొని "ఇందల్లేదురా పాము" అని కేకవేశాడు కుష్టడు.

"లేదూ?" రెస్పాన్స్ పెదబాబుది. "అయితే యింతసేపూ పాము, పామని భయపెట్టి, యింటికొచ్చిన పెద్ద మనుషులుకి భోజనాలు పెట్టకండా ఆలిస్యం చేస్తున్నారన్నమాట! దొంగ లంజికొడకుల్లారా! పామూలేదు, గీమూ లేదు, వడ్డించండి వేగిరం" అని రంకెలు వేశాడు పెదబాబు. వెంటనే ఒరియా, ముస్లిమ్ కుక్కులు పెదబాబు కాళ్లమీద పడిపోయి, యెవరికీ బోధపడని మాటల్తో లబలబమన్నారు.

"బాబ్బాబు, ఏమూల్నో నక్కేసింది పాము. లోపల మాత్రం నిశ్చయంగా వుంది. మాకేమిటి, ప్రాణాలకి తెగించి వడ్డించేస్తాం. కాని వడ్డన మధ్యలో ఏ గిన్నెల మూలనుండో అది బుస్సున పైకొచ్చి ఎవడ్ని

కరిచేసినా - అప్రతిష్టమీకు. వాడు వెంటనే చచ్చిపోతాడు - అలాటి త్రాచుపాము. వాడు మధ్యని ఎవడేనా చచ్చిపోతే, అది ఎలాటి అపశకునమో ఆలోచించండి". ఇదీ వాళ్లమాటల సారాంశం.

సెంటెమెంట్ పడగవిప్పిన నాగుపాములా లేచింది పెదబాబు మనస్సులో. దాంతో కోపాన్ని అదుపులోకి తెచ్చుకొని, "అయితే వేగిరం వెతకండి అదెక్కడ నచ్చిందో" అని కేకవేశాడు. మళ్లీ మరోసారి పాముని వెతకడం ఆరంభమయింది. ఇల్లల్లా దేదీప్యమానంగా వెలిగి పోతున్నది లైట్లతో. అయినా అవి చాలవ న్నట్టు గజింబారు టార్చిలైటు పట్టుకొని అంగుళం అంగుళం వెతికేడు కుష్టడు. ఆ వెతకడంలో వంటగది లోంచి పక్కగదిలోకి వెడుతున్న నీళ్లబొండే కనిపించింది కుష్టడికి. దాన్లోంచి పాము వెళిపోయినట్టు వాడికి అనుమానం తగిలింది. వెంటనే "పాపయ్యోరే! ఈ బొండే లెల్లి పామెల్లిపోయుంటాదిరా. ఈ బొండేకి అత్తలేటున్నాది?" అనడిగేడు.

"అత్తలా?" ఏమిటి సమాధానం చెప్పాలో బోధపడ్లేదు పాపయ్యకి. ఒక్కక్షణం తర్వాత తేరుకుని "అది అయ్యగారి ప్రయివేటు గదిరా" అని సమాధానం చెప్పేడు.

"అయితే అందులోకి జొరబడి పోయుంటాది" అని సమాధానం చెప్తూ బయటి కొచ్చేశాడు కుష్టడు.

బయట నిలబడ్డ పెదబాబు చెవిలో కూడా పడిందీ సమాధానం. ఆయనలో బయటికి చెప్పుకోడానికి వీల్లేని ఆందోళన కెరటంలా లేచింది. "ఆ గది తన ప్రైవేటు సెల్లర్, అందులో రకరకాల విదేశీ మద్యాల సీసాలు పదిలంగా దాక్కుని వున్నాయి. ఎన్నో ఏళ్ల నుండి ఒకటొకటిగా తను కష్టపడి సంపాదించుకున్న మధువులు అవన్నీ. అవి ఎవరికోసం కొన్నవి కావు. తనే, తన ఆనందం కోసం దాచుకున్నాడు వాట్ని. ఎప్పుడేనా హాయిగా గడపాలనిపించినప్పుడు, తన యీ ప్రయివేట్ బార్లోకి ఒంటరిగా ప్రవేశించి, ఏసీ చల్లదనంలో ప్రశాంతంగా, అన్ డిస్టర్బ్‌డుగా తన రేర్ వైన్స్‌ని ఆస్వాదిస్తూ వుంటాడు. ఆ గదిలోకి తను తప్ప యితరులెవరూ యింతవరకూ ప్రవేశించలేదు. ఇవాళ యీ దరిద్రగొట్టు పాము అందులోకి దూరి, తన ప్రత్యేక మందిరం తాలూకా గుట్టు కాస్తా బైటపడేట్టు చేసి, తన పరువు ప్రతిష్టల్ని సర్వనాశనం చేసేటట్టు కనపడుతోంది. పాముకోసమని ఆ గది ద్వారా తెరిస్తే యింకేమన్నా వుందా? తన ప్రయివేటు స్వర్గం ద్వారాన్ని తన చుట్టూ వున్న రాక్షసి ముండాకొడుకులకి తెరిచి చూపించినట్టే కదా! ఈ మంద లోంచి ఏ ఒక్కడు లోపలికి చొరబడి చూసినా, తను వాళ్లకి సెర్వ్ చెయ్యకుండా దాచిపెట్టుకున్న మధు నిక్షేపాల గుట్టు బయటపడ పోతుంది. దాంతో గగ్గోలు తప్పదు. "మా బతుకులికి యివి చాల్లే అని వూర్లో దొరికే దేశవాళీ విదేశీ సరుకుని గ్లాసుల్లో పోయించి సెర్వ్ చేయించి, అసలు సిసలైన విదేశీ సరుకుని నీకోసం దాచేసుకున్నావా? ఇలాటి ప్రత్యేక సందర్భంలో కూడా కాస్త నీ ప్రత్యేక మధువుని మాకు రుచి చూపెట్టకండా దాచేసుకున్నావు కదా - నువ్వేం మర్యాదస్తుడివి? లిక్కరే నలుగుర్తోనీ పంచుకోలేని వాడివి, రేప్పొద్దున్న దొంగ సారా వ్యాపారంలో లాభాలు మాకు నమానంగా పంచియిస్తావా?" అని ఎవడేనా నిలవదీస్తే, తనేం చెప్పగలడు? నిజానికి వచ్చిన వాళ్లకి నాటు సరుకు సెర్వ్ చేయించలేదు. ఓ మాదిరి మంచిరకం విదేశీ సరుకే యిప్పించేడు. పైగా, మరో రౌండు తెప్పించని అంటే, సెర్వ్ చెయ్యడానికి సిద్ధంగా మరికొన్ని సీసాలు కూడా రడీగా వుంచేడు. అయితే, దరిద్రం కాలి ఆ సీసాలు కూడా ఆ గదిలోనే తగల డ్డాయి" ఈ విధంగా తన ప్రైవేట్ రూమ్ ముందు నిలబడి పరిపరి విధాల - అపర ఫాల్‌స్టాఫ్



(Falstaff) లా స్వగతించేడు పెదబాబు. ఏది ఏమైనా ఆ పాముని ఆ గదిలోంచి బయటికి తరిమెయ్యాలి. అది యిప్పుడా, ఇంగ్లీషు లెక్చరర్ గభాలుని కల్పించుకొని "టెంటలస్ కప్" అని గొల్లున నవ్వేడు.

వాడ్ని పట్టుకొని చావగొట్టేయాలన్నంత కోపం వచ్చింది పెదబాబుకి. సాయంత్రం నుండి వాడు పేల్తున్న అసందర్భ ప్రేలాపాలకి అంతులేకుండా పోతోంది. ఇలాటి వాగుడు వాగే వెధవ ఆ మేష్టరుగానే తగలడి వుండకూడదూ. ఏ ట్యుటోరియల్ కాలేజీనో పెట్టుకుని. అయితే, ఏ స్టూడెంటుకీ వాడి పాఠం అక్కర్లేదు - అంతటి గొప్ప టీచరు వాడు. వీడుకి నిత్యంమందు, ముండ వుంటేగాని రోజు వెళ్లదు. అందికని మేష్టరు బతుకు బతికేననే ఆలోచన కూడా లేకుండా, సారా సిండికేటులో చేరేడు, ముష్టి లంజికొడుకు. ఏదో చెప్పాలని నేను తంటాపడ్తుంటే, అడ్డు తగిలి ఆలోచన తెంచీసేడు" అని మనసులోనే ఒక్కక్షణం విసుక్కుని, మళ్లీ ఆలోచనల్లని ట్రేక్‌లోకి తెచ్చుకొని ప్రారంభించేడు పెదబాబు:

"అదీ, మన మేష్టారు చెప్పినట్టు వండింది నోటి దగ్గరకి రాకుండా అయిపోతోంది యివాళ. ఇదే చూడండి - సరిగ్గా వాడు భోజనానికి ముందు, మీ అందరికీ ఒక గ్రీండ్ఫ్రెంచి వైన్ సెర్వ్ చేసి 'ఆహా!' అనిపించుకోవాలని ఎంత వుబలాట పడ్డానో ఆ పరమాత్ముడికి తెలుసు. అయితే యింతవరుకూ వంట వస్తువులున్న గదిలో బైఠాయించిందని కుష్టడు చెప్తున్నాడు. ఇప్పుడేం చేద్దామో మీరే చెప్పండి - పాముని దాని మానానికి దాన్ని ఒదిలేసి, ఏదో బజారు సరుకు తెప్పించుకొని తాగేద్దామా, లేక గది తెరిపించి పాముని పట్టించేద్దామా?" అన్నాడు.

ఇంగ్లీషు మేష్టరు ముందుకి తోసుకొచ్చేసి "నో, నో బజారు సరుకు వోన్ట్‌డూ. నీ గార్డెన్ ఆఫ్ ఏడెన్‌లోకి జొరబడ్డ ఆ సేటన్‌ని (Satan) మనందరం చూసి తీరవల్సిందే, చూసింతర్వాత నువ్విచ్చే ఫ్రెంచి వైన్ ఆఫ్ నాలెడ్జిని ఆస్వాదించవలసిందే" అని గట్టిగా, నిర్ద్వందంగా చెప్పి బడబడ నవ్వేడు ఆయన్ని కాదని మరో ప్రతిపాదన చేసే ఓపిక అక్కడ మరెవ్వరికీ లేదు.

"సరే అయితే, ఒరే పాపారవు - ఆ గది తెరిచి అందులో ఆ పాముందో లేదో చూడమను" అని ఆర్డరు వేశాడు పెదబాబు.

X X X

గర్భగుడి తలుపులు తెరుచుకొన్నట్టు పెదబాబుగారి మినీబార్ తలుపులు తెరుచుకున్నాయి. ఆ గది అంత విశాలంగా ఏమీ లేదు. కాని ఆ గదిలో ఏదివ్యసురానందాలు దాగి వున్నాయో చూడాలనే ఆదుర్దావల్ల కాబోలు పెదబాబు స్నేహితులంతా ఆ గదిలోకి వురకబోయారు. అయితే గదిలోకి అందరికంటే ముందస్తుగా ప్రవేశించిన కుష్టడు

వాళ్లని ద్వారానికి యివతలే ఆపుచేశాడు. వాడి మాటలు వాళ్లకాళ్ళకు సడన్ బ్రేకులు పడేట్టు చేశాయి. "పురుగు గదిలో వున్నాది బాబూ! అంచేత ఎవ్వరూ గదిలోకి రాకండి. మీరంతా గుసగుస మాటలు కూడా మాటాడకంట వూరుకోవాల కసింతసేపు. మీరంతా కసింత ఎనక్కెలి పోండి. ఎట్నుంచి ఎటొచ్చి అదిగాని బయటికి పరిగెత్తు కొచ్చేసిందా, దాని గాబరాలో అది ఎవుల్ని కాటేసేస్తాదో తెల్దుకదా - మన్లేగర్తలో మనం వుండాల. అంచేత మీరంత దూరంగ ఎల్లిపోండి బాబూ! ఒరే పాపయ్యా, ఏదా టార్చిలైటిటిమ్మీ" అని టార్చి అందుకొని గదిలోకి ప్రవేశిస్తున్నాడు కుష్టడు. కుష్టడ్ని మనసులోనే అభినందించకున్నాడు పెదబాబు, తన మినీబార్ చిల్లరమల్లర గాళ్లందరికీ ఎక్స్‌పోజ్ కాకుండా కాపాడినందుకు.

అంతా భయం భయంగా అనుకోకుండానే మెల్లి మెల్లిగావెళ్ళి పోతున్నారు - గదికి సాధ్యమయినంత దూరంగా. అందరూ మాటలు మానేసి, చేష్టలుడిగి చూస్తుండడంతో కిందని చెమ్చా పడ్డాపెద్ద శబ్దంగా అందరికీ వినేపడేటట్టుంది.

అవతల కుష్టడు ఒక్కడే టార్చిలైటు పట్టుకొని, మెల్లిగా, జాగ్రత్తగా గదిలోకి అడుగుపెట్టేడు. ధైర్యంగా చీకట్లోకి వెడుతున్నవాడి ఆకారం ఆదిమానవుడు తన గుహలోకి ప్రవేశస్తున్న దృశ్యాన్ని గుర్తుకు తెస్తోంది ఇంగ్లీషు మేష్టరికి. "వెరిటబుల్ ఏడమ్ వాకింగ్ ఇన్టూ హిజ్ ప్రేహిస్టారిక్ కేవ్" (Veritable Adam walkig into his pre-historic cave) అని గొణుక్కున్నాడు తనలో తాను. మిగిలిన వాళ్లంతా మనసులో "ఏఁవిధైర్యం, ఏఁవిధైర్యం, తప్పటడుగు వేస్తే తాచుపాఁవు కరిచేస్తుందని తెలిసికూడా ఎలా వెళుతున్నాడు" అని అనుకుంటున్నారు.

గదిలోకి ప్రవేశించిన కుష్టడు టార్చిసాయంతో మెల్ల మెల్లగా ఓ పక్కనుండి వెతుక్కొన్తున్నాడు. లైట్లువేసి ఆ వెలుతుర్లో పాఁవుని గాబరా పెట్టకూడదని వాడిప్లేన్. లైట్ల స్విచ్ మీద చెయ్యివుంచే, టార్చి మెల్లమెల్లగా కదుపుకుంటూ వస్తున్నాడు. అకస్మాత్తుగా, ప్రకాశవంతమైన టార్చి వెలుతుర్ని అవహేళన చేస్తున్నట్టుగా, మిలమిల మెరుస్తున్న రెండు కళ్లు వాడి కంట బడ్డాయి. స్విచ్‌వేశాడు.

గదినాలుగు గోడలమీదా వున్న శ్వేత సర్పాల్లాంటి నాలుగు ట్యూబులైట్లు వెలిగేయి. గదిని వరదలా నింపుతున్న వెల్తురులో, అతినాజూకైన గాజు బీరువాలో అందంగా అమర్చబడిన విదేశీ మద్యం సీసాలు రంగురంగుల మెరుపుల్ని చిలికిస్తూ కనిపిస్తున్నాయి. పొందికైన చిన్నగదీ, గది మధ్యలో మహానాజూకైన చిన్నటేబిలు, దాని ముందర మెరిసిపోతూ కుర్చీ, చేతికందేంత దగ్గరగా చిన్న ఫ్రిజ్, కుర్చీలో కూర్చున్న వాళ్లని ఆకర్షిస్తున్నట్టు ఎదురుగా బీరువాలో రంగురంగుల మద్యం సీసాలు, వాటికి దగ్గర్లో నిమ్మకినీరెత్తినట్టు పడుక్కున్న పాఁవు - యివన్నీ ఓవింత లోకంలా భ్రమకలిగిస్తూ, కుష్టడ్ని దిమ్మెరపోయేటట్టు చేస్తున్నాయి.

కాళీఅయిన సీసాల్లోంచి జారిపడిన మద్యం చుక్కల్ని నాకినట్టుంది, ఏదో ఆనందంతో, మత్తుగా చూస్తోంది పాఁవు. ఇలాటి దృశ్యాన్ని, యిలాటి స్థితిలో వున్న పాఁవునీ, యింతకు ముందెన్నడూ చూసి వుండకపోవడంతో, చేష్టలుడిగి వాడలా నిలబడ్డంలో ఆశ్చర్యంలేదు.

పురిషెడు నాటుసారానేనా యింత వర్కు తనని నోట్లో వేస్కో నివ్వలేదు అమ్మ. సినిమాల్లో హీరోల్లాగ మందుకొట్టి చాదులు వెయ్యాలని తనకెంత కోరిక! అయినా అలాటి కోరికలు ఎన్నటికీ తీరనివ్వకంట లంఖిణి లాటి అమ్మ! ఛీ! ఏంబతుకు! లోకంల యినాటి మందుసీసాలు, పక్కగదిలో గిన్నెల్లో వున్నలాటి మజా అయిన మాంసాలు రుచి సూడకపోయిం తర్వాత- బతికినా ఒకిటే! ఎంతకని తనీగేదెల్ని కాసుకుంటూ దిక్కుమాలిన బతుకు బతకాల? ఇనాటి ఎదవ బతుకు బతికేకంటే యీ పాఁవు నోటి ముంగల సెయ్యెట్టి సచ్చిపోతే సరిపోద్ది కదా!" ఇలా నిషాదయోగంలో పడిపోయాడు కుష్టడు. అయితే వాడికో ఆలోచన కూడా వచ్చింది. తను గాని యీ పాఁవు కాటువల్ల సచ్చిపోతే, జనవల్లా తన గురించి ఏట నుకుంటారు? "ఈ కిష్టిగాడు ఏదో మొనగాడనుకున్నాంగాని - యీడుత్తి నీటిపాఁవులు, మంటి బుక్కడాలు పట్టి మీసాల్తిప్పిన రకఁవేరా! ఎసలు సినలు తాచుపాఁవు కనిపించే తప్పటికి, నోళ్లబెట్టేసి, జావగారిపోయి, సచ్చూరుకున్నాడు" అని. ఈ ఆలోచన రాగానే వాడికి తలకొట్టేసినట్ల నిపించింది. ఎప్పటికేనా చిరంజీవిలా ఏక్షన్ చెయ్యాలని అను కుంతున్న తను నలుగురి మందర పల్సనైపోడఁవా? హీరో ఆలోచన వచ్చీరాంగానే కుష్టడు మరి ఆలస్యం చెయ్యిలేదు. రంగంలోకి దిగేడు.

సారాచుక్కల్ని బాగా ఎక్కువగానే నాకినట్టున్నాది - తనని ఎదురుగా వున్నవాడు చంపుతాడేమోననే భయం కూడా లేనట్లు ప్రవర్తిస్తోంది పాఁవు. వాడి కందకండా అది సీసాల మధ్యనుండి పాకుర్తూ, పట్టు దొరకనివ్వకండా కదుల్తోంది. వంకర టెంకర సీసాలు, ఆడోళ్ల బట్టల్లేనట్టున్న ఆకారంలో సీసాలు, ఎత్తైన వక్షోజాల్లోకి ప్రవం ఎగదన్నుకొస్తున్నట్లు భ్రమకలిగిస్తున్న సీసాలు, రంగు రంగుల సీసాలు, రంగు రంగుల సారాల్తో సీసాలు. రంగు రంగుల నగ్న స్వరూపాల్లా కనిపిస్తున్న ఆ సీసాల మధ్యనుండి తనుకంగా జారుతూ పాఁవు. కుష్టడిలో జ్వాలలు రేగిపోతున్నాయి. ఇదీ అని చెప్పడానికి వీలుకాని తృష్ణ, దాహం, వెర్రికోరిక పాములా కదుల్తున్నాయి వాడి మనస్సులో.

అదిగో అలాటి సమయంలో పాఁవు తాను సాధించ దల్చుకున్న పనేదో పూర్తయనట్టు కుష్టడి చేతికి దొరికిపోయింది, వాడికి బాగా అలవాటైన, వొడుపైన పట్టులో, దానిని కంఠం దగ్గర వొడిసిపట్టుకున్నాడు కుష్టడు. వాడి వుక్కువేళ్ల బంధంలోంచి తప్పించుకోలేని పాఁవు, వాడి చేతిచుట్టూ భయంకరమైన పాపంలా చుట్టలు చుట్టుకుంది. పాఁవుని పట్టుకొని బయటికి వస్తున్న కుష్టడు అతిభయంకరంగా కనిపించేడు అక్కడున్న వాళ్లందరికీ, భయం భయంగా అటూ యిటూ ఒదిగి వాడికి చోటిచ్చేరు. వీధి గేటుదాకా వెనక్కి చూడకండా నడిచిన కుష్టడు, గేటు దగ్గిర ఆగి 'పాపయ్యా!' అని కేక వేశాడు. పాపారావు పరిగెత్తుకొచ్చేడు.

"గొప్పచీకటిగుంది - టార్చిచూపెట్టుమీ - దాన్ని కాలేజి తోట్లో ఒగ్గేసి వొద్దాం" అన్నాడు ఇప్పుడు వాడిమాటల్లో ఆజ్ఞలాటి స్వరమేగాని, అర్థింపులేదు.

"నానా? యీ సీకట్లో? మరినా నెలిపోస్తే యిక్కడ ఎరంజిమెంట్లో?" అని సనుగుతున్నాడు పాపారావు.

"దారిసూపిస్తావా - యీ పాఁవుని యిక్కడే ఒగ్గేసి ఎలిపోమంటావా?" అని గర్జించేడు కుష్టడు.

"ఏట్రాగోల? ఎల్లు, ఎల్లి ఆడికి దోవసూపించు" అని దూరం నుండి పెదబాబు కేక. లైటువేసి దారి చూపిస్తూ, పిల్లిలా ముందుకి కదిలేడు పాపారావు.

చీకటి ఆలోచనల పర్వతం కదుల్తున్నట్టు నెమ్మదిగా నడుస్తున్నాడు కుష్టడు. తనకియింట్లో ఏనాడూ సరైన తిండన్నది దొరకలేదు. పెద్దబాబు గారింట్లో గంగాళాలకొద్దీ మాంసం, సన్నబియ్యపు బిర్యానీ, అన్నాలు, పులుసులు, కూరలు, లడ్లు, జిలేబీలు, పెరుగు.

వేడికి ఎలకలా మాడిపోతూ బోనిపెట్టమీదనో తవుడు కట్టలనారనో, పిడకల కుచ్చెర్ల పక్కనోతను నిత్యంతొంగోవాల. పెద్దబాబు గారింట్లో గదులు విశాలంగా, చల్లగా, హాయిగా- వొయిశాఖమాసం జడిసి పారిపోయి నట్టుంది అతగాడింట్లోంచి.

తను తొడగనానికి నిత్యం యీ ముణుకులు దిగని చెడ్డీ!, పేడ,

మన్ను యీటికంపుతో - ఎన్నాళ్లయిందో దాన్ని ఉతికి!

పెదబాబు గారింటికొచ్చినోళ్లంతా సూట్లు, బూట్లు, తెల్లని పంచిలు, కమీజులు - అంతేల - తన పక్కన్నడుస్తున్నయీ పాపిగాడిబట్టలు కూడా యిస్త్రీనలగని మడతలే!

ఎండనక, వానకనక రోజంతా తను బక్కల్ని మేపుకొచ్చాక- ఒళ్లు నొపలు పోనానికేనా ఒసుక్కమందు యేనాడూ ఏస్కోనానికి లేదు.

మరి పెదబాబు యింట్లో నయితే పార్టీకొచ్చినోళ్లందరి సేతుల్లోనూ, పొట్టిగా, గుండ్రంగా గమ్మటాల్లాంటి గ్లానులే! అన్నిండా పల్చబడిపోయిన రక్తం రంగులో మందు! దేనికేనా పెట్టి పుట్టాల. తెగించి ఏదిసెయ్యనానికీ యీలు కాకంట, ఓ బెమ్మరాచ్చసి ముండ తనకి తల్లైకూకుంది. కుష్టడికి దుఃఖంతో వూనకం వచ్చేసినట్లయింది - తనదీ నావస్తనితల్సుకోగానే గింగిరాలు తిరుగుతూ నోట్లోంచి బయటపడాలని చూస్తున్న యేడుపుని బలవంతంగా అదిమిపెట్టేడు. చేతికిచుట్టివున్న పావు చుట్టల్ని మెల్లిగా విప్పి, అతి లాఘవంగా పావుని తువ్వల్లోకి విసిరేసి, వెనుతిరిగాడు. అనుకోకండా ముఖంమీద పడిన టార్చి వెలుగులో కుష్టడి కళ్లనుండి స్రవిస్తున్న కన్నీటిని చూసి పాపారావు గాబరా పడ్డాడు.

"కుష్టా, ఏడస్తన్నావా? పెపంచికంల ఎవుడూ సెయ్యలేనంత దైర్యవయిన పనిని చేసి, సిన్నపిల్లడిలాగ ఏడస్తన్నావేట్రా?" అనడిగేడు.

"ఏడవక యేటి సెయ్యిమన్నావురా? తిండికీ, బట్టకీ జాగాకి అన్నిటికీ కరువేకదా మాయింటికాడ! ఇయాళ పెదబాబిల్లు నూసినాక తెలిసొచ్చిందిరా మా బతుకులు ఎంత అధ్వాన్నంగున్నాయో!" అన్నాడు గద్గద స్వరంతో కుష్టడు . స్నేహంగా లాలిస్తూ వాడి భుజంమీద చెయ్యివేశాడు పాపారావు. వాడి ఓదార్పు అభయమిస్తున్నట్లుగా వుంది. పెదబాబింటివైపు నడిచేరు వాళ్లిద్దరూ..

పెదబాబుగారింట్లో కుష్టడికి హీరోకి లభించినంత స్వాగతంలభించింది. తాగడాలు, తిండాలు పూర్తయినట్టున్నాయి- అతిధులంతా ఖరీదైన సిగరెట్లు వెలిగించి మాంచి ఖుషీగా వున్నారు. కుష్టడు తిరిగొచ్చేటప్పటికి, తాగుడుమైకంలో అంతస్తుల భేదాన్ని మరచిపోయిన నలుగురైదుగురయితే ఏకంగా కుష్టడ్ని కౌగిలించుకొని వాడి ధైర్యసాహసాల్ని గట్టిగా మెచ్చుకున్నారు. వాళ్లల్లో ఒకాయన కుష్టడ్ని పెదబాబు దగ్గరకి యీడ్చుకెళ్లి "ఇదిగో పెదబాబు, మనకొత్త ప్రాజెక్టుకి అసలు సిసలు సెక్యూరిటీ గార్డ్ కావాలనుకుంటే - యీ కుష్టడ్ని వేస్కోవయ్యా! మనుమల్నుండీ, పోలీసుల్నుండీ కాపాడుకోడానికి కావలసిన ట్రిక్స్ మనకి తెలుసు. కొండలంటూ, అడువులంటే మనకి తెలియని వుపద్రవాలు వచ్చిపడతాయి. అలాటివాటిని ఫేస్ చెయ్యిడానికి కావలసిన గట్స్ యిదిగో యీ కిష్టయ్యలోవున్నాయి. అంచేత నువ్వు మరి రెండో ఆలోచన అన్నది పెట్టుకోకుండా యీ కిష్టయ్యిని మనలెఫ్టినెంట్‌గా వేస్కో" అన్నాడు. చుట్టూవున్న అతిధులంతా ఆ ప్రతిపాదనని బలపరుస్తూ హియర్, హియిర్‌లతో చప్పట్లుకొట్టేరు. "తప్పకుండా, తప్పకుండా అలాగే చేద్దాం" అని తన అంగీకారాన్ని తెలిపేడు పెదబాబు. కాని అతనికి తెలుసు సాయిత్రమ్మనే బ్రహ్మరాక్షసి తనకొడుకుని సారాసామ్రాజ్యపు పొలిమేరల్లోకి కూడా రానివ్వదని. అంచేత స్లోపోయిజన్ పద్ధతిలో ఆ ప్రతిఘటన వృక్షాన్ని కూల్చాలి.

అలా అనుకోడమే తడవుగా తన స్కీములో మొదటి స్టెప్‌క్రింద అతిధులందరి మధ్యన కుష్టడ్ని నిలబెట్టి, ఓ ఫుల్ బాటిల్ తెరిపించి, పార్టీపాడైపోకండా కాపాడిన కుష్టడికి టోస్ట్ ప్రతిపాదించేడు. గ్లాసులు టంగు టంగులు, ఛీర్స్‌ల కోలహలాలు వువ్వెత్తుగా లేచేయి.

తనచేతిలో బలవంతంగా వుంచబడినగ్లాసుని భయం భయంగా పట్టుకున్నాడు కుష్టడు. తాగితే బావుండ్నే మోననే కోరిక మనస్సులో మెదలుతున్నా, తాగితే అమ్మ చంపేస్తుందన్న భయం వాడ్ని పట్టికుదిపేస్తోంది. ఇంతలో పాపారావు వాడి దగ్గరికొచ్చి "ఏట్రా కుష్టా! అనానూస్తన్నావు సంగిరి సింగిరోడ్లాగ? మెల్లింలగా తాగేరా సేకపోతే సుట్టూవున్న బాబులేటను కుంటారో ఎరికా? మేనర్సు లేని మృగంయీడు, యీడికి మనం సాయిం సెయ్యటంవేటి అనుకుంటారు. అందికనీ, పేరంబించు" అని ప్రోద్బలంచేసి, సపోర్టిచ్చేడు.

"తాగితే మాయమ్మ నంపేస్తాదిరా" అని గొణిగేడు కుష్టడు.

"సేనేర్నుయే ఎవులేన అమాటంబేనవ్వుతారు- ఇన్నల్లయి పోతావు. నిలువెత్తు మనిసిని యింతంతేసి జబ్బలు, తాచుపావు లాటిదాన్ని కిక్కురుమనకంట నొక్కేసిన మొగోడివి- అనాటిది అమ్మపేరు సెపితే వుచ్చబోసుకునే రకం అని అందరికీ తెలిస్తే ఎంత ఇన్సల్టో ఆలోసించినావా? ఇయ్యాల్టి కొక్కసారి దయిర్యం సేసి నోట్లో పోసేస్కో - అమ్మేటీ అనకంట నాన్నూసుకుంటాను" అని పాపారావు భరోసాయిచ్చేడు.

చుక్క గొంతుకలోకి దిగిపోయింది కుష్టడికి. ముందస్తుగా తనలోతుతెలియని నూతిలోకి దిగిపోతున్నట్టనిపించింది. ఆ తరవాత మెల్లి మెల్లిగా తేలుతూ ఆకాశంలోకి ఎగిరిపోతున్నట్టనిపించింది. పెదబాబు కన్ను గీటు సంకేతంగా తీస్కొని, కిష్టడ్ని కప్పుకింద పెట్టనివ్వకుండా తాగించేడు పాపారావు. తరవాత వాడిపొట్టపగిలేటట్టు చేపకూర, కోడిమాంసం యిత్యాదులతో బలవంతాచేసి మరీ భోజనం తినిపించేడు. కుష్టడిప్పుడు అసలు సిసలు చిరంజీవి అవతారంలోకి దిగేడు. లొల్లాయి పదాలు పాడుతూ, తిరగబడిపోతూ, తూలిపోతూ, యింటికి వాడుచేరుకున్నప్పటికి చీకట్లు కొద్ది కొద్దిగా పల్చబడుతున్నాయి.

పేడకూడ వేస్తున్న సాయిత్రమ్మకి వస్తున్న కొడుకుని చూడగానే నెత్తిమీద పిడుగుపడినట్లయింది. కళ్లు చీకట్లు కమ్మినట్టనగానే, పేడతట్టకిందపడేసి, రొచ్చులోనే చతికిల బడిపోయింది. తను పెట్టుకున్న ఆశలన్నీ పుర్రుపేడలాగ కరిగి భూవి పాలై పోయినాయి. బతుకంతా కన్నీళ్లు తాగేనా సాయిత్రమ్మకుటుంబం నీతయిన కుటుంబం అని అనిపించుకోవాలని ఆమె పడిన తాపత్రయం, ఒక్కరాత్రితో చితికిపోయింది. తాచుపావుల్ని కూడా అవలీలగా పట్టుకొని పరేగల కొడుక యికతననెందుకూ పనికిరాకంటయిపోతాడు. తాగుడు మహమ్మారి గుమ్మంలో ఒక్కసారి అడుగుపెడితే, యేటవుతాదో ఆమెకెరికే! తన పుట్టంటోళ్లు తోటలు, దొడ్లు, పొలాలు అన్నిట్నీ పోగొట్టుకున్నారు అన్నదమ్ముల తాగుడు వ్యసనంతో, ఇయ్యాళ వాళ్లకి తాగనానికి గెంజికూడా లేదు. తన కుటుంబం అదే లెక్కన పాడయిపోకంట వుండాలని బెమ్మరాచ్చసిలా కాపలాకి కూర్చుందితను. అయితేటి జరిగిందియాళ? తన రాచ్చసితనం, తన కేకలు, తన జొరారీ యివేవీ కాపాడ్నేక పోయినాయి కొడుకుని. అడిమీద పెట్టుకున్న ఆశలన్నీ మట్టిలో కల్సిపోనాయి. పావుని పడ్తానని యెల్లిన కొడుకు పావు కాటుకి బలైపోనాడు. ఆలి జరుగుతాదేమో యెప్పుడేనా అని ముందే అనుమానించి, అసలాడ్ని పావులే పట్టొద్దని పట్టుబట్టింది. సరిగ్గియాళ అదే జరిగింది. ఏ గ్రహపాటువల్లో తనుకసింత బసులుబాటు సూపించగానే మాయదారిపావు కొడుకుని కాటేసేసింది. ఇక అయినం ఆడివాంటెనుండి దిగే ప్రశ్నేలేదు. తనూ ఆడి ఎనకాతల ఒక్కడుగు ఎల్లుంటే యిది జరక్క పోనుకదా! ఛీ! మాయలపకీరు లాటి ఆపా మాటలకి లొంగిపోయి కొడుకుని బలిపెట్టేను కున్నాను."

వూహించి, వూహించి కుమిలిపోయింది సాయిత్రమ్మ. పాతాళంలోంచి వువ్వెత్తునగంగ తన్నుకొచ్చినట్లు సాయిత్రమ్మలో దుఃఖం పెల్లుబికింది. హోరున ఏడుస్తూ ఆ పేడకుప్పలమధ్యనే కూలబడిపోయింది. మొగుడు, తక్కిన పిల్లలు, మనవలు, కోడళ్లు అంతా ఆమెచుట్టూ చేరి ఆమెని లేవదియ్యబోయేరు. ఆమెపడుతున్న వేదనకి కారణం అప్పుడే వాళ్లకి తెలిసిపోయింది. కపిస్తున్నట్లు వాళ్ల చూస్తున్న చూపులు, తాగుడు మైకంలో వున్న కుష్టడికి ఏమాత్రం బోధపడ్లేదు. వాడి సినీమా వెర్రిలో "అమ్మా! నిన్నేడిపించిన ఆనాకొడుకెవుడో సెప్పు, ఆడ్ని పట్టుకొని..." అని యేదో అభినయించబోయి తూలికిందపడ్డాడు. సాయిత్రమ్మ శివమెత్తిన దాన్లా లేచి, గబగబవెళ్లి వాడి జుట్టుపట్టుకొని లేవనెత్తి వాడ్ని గితకబాదీడం మొదలెట్టింది.

వాడులబోదిబోమని తాగుబోతు మాదిరి ఏడుపుకి లంకించుకోడంతో, చుట్టూ చేరిన వీధిజనానికి అసలు జరిగిందేదో తెల్సిపోయింది తనయింటిగుట్టు వీధిలో వాళ్లకి తెల్సిపోయిందన్నప్పటికి సాయిత్రమ్మకి నిజంగా నడిరోడ్డుమీద అవమానం జరిగినట్లనిపించింది. కొడుకుని కసిగా, నిర్దాక్షిణ్యంగా గొడ్డుని బాదినట్టు మరోనాలుగు బాది, గొరగొర వాడ్ని జుట్టు పట్టుకొని వీధి మధ్యకి యీడ్చుకొచ్చి "ఫోనాకొడకా! నా యింట్లోంచి ఫో " అని తోసేసింది. ఆ తోపుకి సరిగ్గా అదేసమయానికి అక్కడికివచ్చిన పాపారావు కాళ్లమీద పడ్డాడు కుష్టడు. పాపారావు వాడ్నిలేపి, వాడిసిపట్టుకొని "ఏటప్పా! ఏటి జరిగిందేటి? ఇనాం ఆడుకర్సు పెట్టేసినాడని కోపంవైపోతున్నావేటి? పెదబాబుగారు యినాం నా చేతికిచ్చి తోల్నారు. ఇదిగో" అని జేబులోంచి కరకరలాడుతున్న ఓ కొత్త వంద కాయితం, కొన్ని చిల్లర కాయితాలు తీసి, ఆమె ముందు వాటిని ఆడిస్తూ "నూటపదార్లు" అన్నాడు.

"నా కొడుక్కి మర్యాదసేసి, పూటుగా సారాతాగించి, కక్కలూ, ముక్కలూ తినబెట్టె ఇంటికి తోల్నాడు కదా మీ పెదబాబు - నా కుటుంబానికి అంతకంటె పెద్ద యినాం యింకేటుంటాదిరా? పాపిగా! పాతికేళ్లబట్టె నాచేతికింద ఒదిగి, నాను చెప్పినట్టు యినుకోని, బతికిన నాకొడుకు - ఒక్కరాత్రిల మీమాటకి వూకొట్టేసి పాతికేళ్ల బట్టె నేను బోదపరుస్తున్నదాన్ని తలాయించేసి, మీరిచ్చిన సారాతాగేసి, మీరిచ్చిన తిండితినేసి- మీమనిసై పోనాడుకదా- నా బతుక్కి అంతకంటె అవుమానం యేటుంటాదిరా కుక్కల్నాకొడకా? ఎల్లు, యిక్కడ్నుండి బేగెల్లిపో! అదిగో ఆడ్ని నెగదీసినావుకదా- ఆడ్నికూడా ఒట్టికెల్లి నీ పెదబాబు పాదాల కాడ పడే! పెదబాబుగారి చేపేల్లాగే (కుక్కల్లాగే) యీడూ పెదబాబు కాళ్లూ, యేళ్లు నాక్కొని బతుకుతాడు. బేపినాగ సక్కగ నాకడం నేర్పనానికి నివ్వున్నావ్! లే, ఆడ్నిక్కడ్నుండి తీస్కెల్లిపో! బేగిద్దరూ కదుల్తారా యిద్దరకీ కలిపి కాల్లిరగ్గొట్టేమంటావా?' అనిపెనురక్కసిలాగ అరిసి, దగ్గరున్నగేదెల కట్టు కొయ్యనిపెకలించడానికి పూనకంవచ్చిన దాన్లాపరిగెత్తింది సాయత్రమ్మ. కోడళ్లు, కొడుకులు ఆమెని ఆపి సమాధాన పర్చడానికి ప్రయత్నిస్తున్నారు. ఆమెరోదనం, భూదేవి రోదనంలాగ వాడవాడంతటికీఎంతోదయ నీయంగా వినిపిస్తోంది. పాపయ్య కుష్టడ్ని తీస్కుని అక్కడ్నుండి వెళ్లిపోయాడు.

●

గంగాధరం సాహితీ కుటుంబం (రిజి) నిర్వహించిన

నూతలపాటి సాహితీ సత్కార సభలో పాల్గొన్న అతిధులు:
ఎడమనుండి : శ్రీ సింగమనేని నారాయణ, శ్రీ మధురాంతకం రాజారాం, గౌ॥ ఉన్నత విద్యాశాఖా మాత్యులు శ్రీ గాలి ముద్దుకృష్ణమనాయుడు, ఆచార్య పి.వి. అరుణాచలం, 'జీవని' కథల సంపుట రచయిత, అవార్డు గ్రహీత డా॥వి. చంద్రశేఖర రావు.

విస్మృత కథ - విజ్ఞప్తి

చరిత్రలో మరుగున పడిన కొన్ని మంచి కథలు 'విస్మృత కథ' పేరుతో పాపినేని శివశంకర్, వల్లూరి శివప్రసాద్, పెనుగొండ లక్ష్మీనారాయణల సంపాదకత్వంలో వెలుగు చూడబోతున్నాయి. ఈ కథా సంకలనాన్ని పల్లవీ పబ్లికేషన్స్, విజయవాడ ప్రచురి స్తున్నారు.

సంకలనంలో ఎన్నికైన కొందరు కథా రచయితల పేర్లు ఇవి : 1) కనుపర్తి వరలక్ష్మమ్మ 2) కపిల కాశీపతిరావు, 3) బందా కనకలింగేశ్వరరావు 4) గూడూరు రాజేంద్రరావు, 5) నెమలికంటి రాఘవయ్య 6) 'విజయ' ('గొల్లరామవ్వ 'కథారచయిత) 7) ఇసుకపల్లి దక్షిణామూర్తి, 8) క్రొవ్విడి లక్ష్మన్న 9) సింగరాజు లింగమూర్తి 10) కొనకళ్ల వెంకట రత్నం 11) కోటంరాజు జనార్ధనరావు 12) పూడిపెద్ది వెంకట రమణయ్య 13) వేలూరి సహజానంద.

పైరచయితల వివరాలు, ఫొటోలు మొదలైన సమాచారం సంపాదకులకు పంపి సహకరించవలసిందిగా కథాభిమానులకు, రచయితలకు విజ్ఞప్తి. పంపవలసిన చిరునామా : పాపినేని శివశంకర్, విద్యానగర్, గుంటూరు - 522 007.
ఫోన్ : 352276 పాపినేని శివశంకర్